

నేడు పాఠశాలలకు సెలవు

పార్వతీపురం/సాలూరు రూరల్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా సోమవారం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల రాకపోకలకు ఇబ్బం దులు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకు న్నట్లు పేర్కొన్నారు. వర్షంలో పిల్లలు బయటకు రాకుండా తల్లిదండ్రులు చూసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా పాఠశాలలు మరో సెలవు రోజున పనిచేయాల్సి ఉంటుందని ఉపాధ్యాయులకు తెలియజేశారు.

దంచికొడుతున్నాయ్!

- జిల్లాలో ఎడతెరిపిలేని వానలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ముంపులో పంట పొలాలు
- జలాశయాలకు వరద
- ఉప్పొంగుతున్న వాగులు, వంకలు



స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

పార్వతీపురం, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ప్రధాన కూడళ్లు, రహదారులపై వర్షపునీరు నిలిచిపోతోంది. రహదారులు ఛిద్రమవుతున్నాయి. పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. కొన్నిచోట్ల చెరువులను తలపిస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గత రెండు రోజులతో పోలిస్తే ఆదివారం వాన దంచికొట్టింది. ఎడతెరిపిలేని వర్షంతో ప్రజలు పూర్తిగా ఇళ్లకే పరిమితమయ్యారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో వరహాల గెడ్డకు వరద పోటెత్తింది. దీంతో వివిధ కాలనీలు, వీధుల్లో నీరు చేరింది. సాలూరు, సీతంపేట, భామిని పాలకొండ, కురుపాం, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ కుండపోతగా వర్షం కురిసింది. జిల్లాతో పాటు ఎగువ ప్రాంతం ఒడిశా రాష్ట్రంలోనూ వానలు కురుస్తుండడంతో పెద్దగెడ్డ, వీఆర్ఎస్ రిజర్వాయర్ తదితర జలశయాల్లో నీటి ప్రవాహం పెరిగింది. గడిచిన రెండు రోజులుగా ఏజెన్సీలో జోరువాన కురుస్తుండడంతో గిరిజన రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. మరికొన్ని చోట్ల ఆదివారం వరినాట్లు వేశారు.



లివిరి సమీపంలోని పొలాల్లో పోటెత్తిన వర్షపు నీరు

నాగావళికి వరద..

● గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో ఆదివారం పైప్రాంతం నుంచి 7 వేల క్యూసెక్కులు చేరింది. ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే గేట్ల నుంచి 6 వేల క్యూసెక్కులకు దిగువకు మళ్లించారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.08 మీటర్ల మేర నీటి నిల్వ ఉంది. సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన కాలువల నుంచి 1170 క్యూసెక్కులను సరఫరా చేస్తున్నారు. భారీగా వర్షాలు కురుస్తుండడంతో నదీ తీర ప్రాంతవాసులకు హెచ్చరికలు జారీ చేసినట్లు ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథరావు తెలిపారు.

ముంపులో పొలాలు..

● గరుగుబిల్లి: రావుపల్లి సమీపంలోని దేసూరిగెడ్డ పరిధిలోని సుమారు 400 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. గెడ్డ పరిధిలో గత కొన్నాళ్లుగా పూడికలు తొల గించకపోవడంతో పంట పొలాల వైపు వరద నీరు చేరింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ముందుగానే ఉబాలు చేపట్టినా వరదతో ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. ముంపునకు గురైన పంటలను పరిశీలించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

● భామిని: భామిని సమీపంలోని పొందుపాముగెడ్డ ఉప్పొంగడంతో లివిరి సమీపంలోని తంపర పొలాలు నీట మునిగాయి. గెడ్డబట్టీని ఆక్రమించడంతో లివిరి, దిమ్మిడిజోల ప్రాంతాల్లో సుమారు 300 ఎకరాలకు ముంపు సమస్య ఉందని రైతులు చెబుతున్నారు. కాగా భామిని పరిధిలోని వంశధార నదిలో ఆదివారం సాయంత్రానికి

(మిగతా 8వ పేజీలో..)



దేసూరిగెడ్డలో నీట మునిగిన వరి పైరు

పనులు చేశారు..
పలకలు మరిచారు
8లో



పిచ్చిమొక్కలు పెరిగి..
ప్రమాదకరంగా మారి
● శిథిలావస్థలో తోటపల్లి పాత బ్యారేజీ కల్వర్టు
● భయాందోళనలో వాహనచోదకులు



8లో

తమ్ముడిని కాపాడి.. అనంతలోకాలకు..

- నాగావళి నదిలో విద్యార్థి మృతి
- ఊపిరి తీసిన ఊబి
- శుభ కార్యానికి వచ్చి.. విగతజీవిగా మారి..
- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

పాలకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నాగావళి నదిలోని ఊబిలో కూరుపోయి ఓ విద్యార్థి మృతి చెందాడు. తన తమ్ముడిన కాపాడి.. చివరకు అనంత లోకాలకు వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. పాలకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం రూరల్ నవనంపాడు గ్రామానికి చెందిన ద్వారపూడి పవన్(16) విశాఖలోని ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తమ బంధువుల గృహ ప్రవేశం సందర్భంగా శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి పాలకొండ మండలం అన్నవరం చేరుకున్నాడు. ఆదివారం ఉదయం బహిర్భూమికని తన తమ్ముడు భార్గవ్, చిన్నాన్నతో కలిసి ఆ గ్రామంలోని నాగావళి నదికి వెళ్లాడు. తొలుత భార్గవ్ నదిలో దిగేందుకు ప్రయత్నించి అక్కడున్న ఊబిలోకి కూరుకుపోయాడు. ఇది గమనించిన పవన్ భార్గవ్‌ను ఒడ్డుకు లాగి ప్రమాదవశాత్తూ నదిలోని అదే ఊబిలో కూరుకుపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన నది వద్దకు చేరుకుని పవన్‌ను రక్షించే ప్రయత్నం చేశారు. ఊబిలో నుంచి పవన్‌ను బయటకు తీశారు. అప్పటికే స్పృహ కోల్పోయి ఉండడంతో సీపీఆర్ చేసి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే మార్గమధ్యంలోనే పవన్ మృత్యువాత పడ్డాడు. దీంతో తల్లిదండ్రులు ద్వారపూడి రవి, వసంతలు భోరున విలపించారు. అంతవరకు తమతో ఉన్న కుమారుడు ఇలా ఆకస్మికంగా మృతి చెందడాన్ని వారు జీర్ణించు కోలేకపోయారు. మరోవైపు గృహ ప్రవేశానికి వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు. అందరితో సరదాగా గడిపిన పవన్ విగతజీవిగా మారడంతో కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పాలకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పవన్ (ఫైల్)

ఇసుక తవ్వకాలే కారణమా?

అన్నవరం గ్రామ సమీపంలోని నాగావళి నది తీరంలో నిత్యం ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో భారీగా గుంతలు ఏర్పడుతున్నాయి. ఇవి గమనించక నదిలో స్నానాలు, ఇతర అవసరాల కోసం దిగుతున్న వారు మృత్యువాత పడుతున్నారు. పవన్ మృతికి కూడా ఆ గుంతలే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపి స్తున్నారు. నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులతో పాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రెడ్డివానివలసలో కార్డన్ సెర్చ్
● సారా, వెయ్యి లీటర్ల మడ్డికల్లు స్వాధీనం
విజయనగరంలో
స్పా సెంటర్ల తనిఖీ
7లో
కొండవెలగాడలో ఉత్తరాంధ్ర స్థాయి మహిళల
వెయిట్ లిఫ్టింగ్ పోటీలు
8లో
రోడ్లన్నీ జలమయం
● గోతుల్లో నిలిచిన నీరు
● రాకపోకలకు అవస్థలు
7లో



ఆదుకోండి సారూ!

- దయనీయ స్థితిలో సాక్షరభారత్ గ్రామ కోఆర్డినేటర్లు
- ఇప్పటికే మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేత
- కచ్చితంగా న్యాయం జరుగుతుందని ఎదురుచూపు
- వలంటీర్ల నియామకంలో ప్రాధాన్యం ఇవ్వాలని వేడుకోలు



మంత్రి లోకేశ్‌కు సమస్య వివరిస్తున్న దృశ్యం (ఫైల్)

జియ్యమ్మవలస, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆదుకుని.. అండగా నిలుస్తామన్న గత వైసీపీ సర్కారు హామీ గాలిలో కలిసిపోయింది. దీంతో ఉమ్మడి జిల్లాలో సాక్షర భారత్ గ్రామ కోఆర్డినేటర్ల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే వారు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే గ్రామ కోఆర్డినేటర్ల ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కలిశారు. తమ సమస్యలను వివరించి.. వినతిపత్రాలు అందించారు. కచ్చితంగా తమకు న్యాయం జరుగు తుందని వారు భావిస్తున్నారు. సర్కారు ప్రకటన కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కాగా వలంటీర్ల నియామకం ప్రభుత్వ చేపడుతున్నట్లు పుకార్లు ఎక్కువవడంతో ఇందులో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు వేడుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి ...

సాక్షరభారత్ గ్రామ సమన్వయకర్తలను 2010, ఆగస్టులో అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య ప్రభుత్వం నియమించింది. అప్పటికి నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే వారి విధి. కానీ కాలక్రమంలో ఓటర్ల జాబితా సరిచేయడం , బీఎల్‌వోలుగా, పింఛన్ల పంపిణీతో పాటు గ్రామస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల బాధ్యతలు అప్పగించేవారు. మండల కోఆర్డినేటర్‌కు రూ.6 వేలు, గ్రామ కోఆర్డినేటర్‌కు రూ.2వేలు చొప్పున గౌరవ వేతనం ఇచ్చేవారు. 2018లో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే వారిని తొలగించేశారు. దీంతో నేరుగా విజయవాడ వెళ్లి ధర్నా చేశారు. న్యాయం జరిగేలా చూస్తానని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఈ లోపు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అదే సమయంలో పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్ వద్దకు కూడా వీరు వెళ్లి వారి సమస్యలను వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదుకుంటామన్నారు. కానీ మండల కోఆర్డినేటర్లకు కొంత ఊరట కలిగించారు. గ్రామ సమన్వయకర్తలను మాత్రం పట్టించు కోలేదు. దీంతో వారు కొద్ది నెలలు మండల, జిల్లా స్థాయిల్లో నిరసనలు తెలియజేశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌తమకు న్యాయం చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో రెండు వేల మంది గ్రామ సమన్వయకర్తలు ఉన్నారు.

విద్యాశాఖ మంత్రి దృష్టికి..

గ్రామ సమన్వయకర్తల జిల్లా ప్రతినిధి జియ్యమ్మవలస మండలానికి చెందిన

(మిగతా 8వ పేజీలో...)



వైసీపీ హయాంలో నిరసన తెలుపుతున్న గ్రామ సమన్వయకర్తలు

అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధం

- అర్హులైన దివ్యాంగులకే పింఛన్లు
- వాస్తవిక అర్హతను బట్టి మార్పులు చేపట్టిన ప్రభుత్వం
- రద్దు అయితే అప్పీల్ చేసుకునేందుకు అవకాశం

పార్వతీపురం, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారిలో అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధమైంది జనవరి నుంచి ఇప్పటివరకు చేపట్టిన తనిఖీల్లో అనర్హులుగా గుర్తించిన వారికి నోటీసులు అందించనున్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు అందాయి. సదరం ధ్రువీకరణ పత్రంలో 40 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉన్నట్టు నమోదైన వారికి పింఛన్లు రద్దు చేయ నున్నారు. అంత కంటే ఎక్కువ వైకల్యం ఉండి , తీవ్రమైన అనారోగ్యం లేకుండా ఉన్న వారికి పింఛన్ కేటగిరీని రూ.15 వేల నుంచి రూ.6 వేలకు మార్చనున్నారు. 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉండి వృద్ధుల కేటగిరీలోకి వచ్చే వారికి రూ.4 వేలు పింఛను అందించ నున్నారు. దీనికి అనుగుణంగా కొత్త పథకం ధ్రువీకరణ పత్రాలను గ్రామ, వార్డు సచివాలయాలు ద్వారా ఉచితంగా జారీ చేయనున్నారు. వైకల్య శాతంలో ఏమైనా తేడాలున్నట్లు లబ్ధిదారులు గుర్తిస్తే తిరిగి అప్పీల్ చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నారు. రద్దు అయిన పింఛన్ దారులు అర్హులమని అనుకుంటే పాత సదరం సర్టిఫికెట్, తాజాగా అందిన నోటీసును తీసుకుని ఆసుపత్రుల్లోని సంబంధిత వైద్యులతో పరీక్షించుకోవచ్చు. నిబంధనల ప్రకారం ఉన్న ప్రొఫార్మాలో మాన్యువల్ సర్టిఫికెట్ పొందాలి. నోటీసు అందుకున్నవారంతా 30 రోజుల్లోగా అప్పీల్ చేసుకోవాలి.



రద్దయిన పింఛన్లు ఇవీ..

పార్వతీపురం నియోజకవర్గంలో 1044 పింఛన్లు రద్దయ్యాయి. వాటిల్లో బలిజిపేట మండలంలో 161, సీతానగరంలో 465, పార్వతీ పురం మండలం 322, అర్బన్‌లో 96 ఉన్నాయి. కురుపాం నియోజక వర్గంలో 833 రద్దు కాగా, అందులో గరుగుబిల్లి 312, గుమ్మలక్ష్మీపురం 44, జియ్యమ్మవలస 222, కొమరాడ 157, కురుపాం మండలంలో 98 ఉన్నాయి. సాలూరు నియోజకవర్గంలో 611 రద్దు కాగా మక్కువలో 355, పాచిపెంటలో 101, సాలూరు మండలంలో 97, సాలూరు అర్బన్‌లో 58 ఉన్నాయి. పాలకొండ నియోజక వర్గంలో 293 పింఛన్లు రద్దయ్యాయి. ఇందులో భామినిలో 68, పాల కొండ మండలంలో 45, అర్బన్‌లో 62, సీతంపేటలో 2, వీరఘట్టంలో 86 ఉన్నాయి. మొత్తంగా జిల్లాలో 2,781 పింఛన్లు పూర్తిగా రద్దయ్యాయి. ఇదిలా ఉండగా పార్వతీపురం నియోజకవర్గంలో 148, కురు పాంలో 250, సాలూరులో 87, పాల కొండలో 48 పింఛన్లు కన్వర్షన్ అయినట్లు గుర్తించారు. 'జిల్లాలో 2,781 పింఛన్లు రద్దయ్యాయి. మరో 533 పింఛన్లు కన్వర్షన్ అయినట్లు గుర్తించాం. వీటి జాబితా గ్రామ వార్డు, సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాం.' అని డీఆర్‌డీఏ పీడీ సుధారాణి తెలిపారు.

గతంలో ఇలా..

వైసీపీ ప్రభుత్వం అనర్హులకు మెడికల్, దివ్యాంగ పింఛన్‌లను అందించిందన్న ఆరోపణలు విస్తృతంగా వచ్చాయి. ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు చెందిన వారంతా వీటిని దొడ్డిదారిలో

(మిగతా 8వ పేజీలో...)

అదుపు తప్పి లారీ బోల్తా.. క్లీనర్ మృతి
● ముగడవలస వద్ద ఘటన
7లో
పాలకొండను జిల్లాగా ప్రకటించాలి
● జిల్లా సాధన సమితి డిమాండ్
8లో
హైకోర్టు న్యాయమూర్తి తుహిన్‌కుమార్‌కు సన్మానం
● పాలకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..
8లో
పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద తనిఖీలు
8లో

రోడ్లన్నీ జలమయం

● ఎడతెరిపిలేని వర్షం ● గోతుల్లో నిలిచిన నీరు
● రాకపోకలకు వాహన చోదకుల అవస్థలు

జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. ఆదివారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. గుంతల్లో నీరు నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు.

అధ్వానంగా గర్భాం రోడ్డు

గరివిడి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గరివిడి నుంచి మెరకముడిదాం మండలానికి వెళ్లే గర్భాం రోడ్డు వర్షాలకు అధ్వానంగా మారింది. రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడి వర్షపునీరు చేరింది. శివారు భాగాల్లో బురదమయంగా మారింది.

భోగాపురం పశువుల ఆసుపత్రి సమీపంలో..

భోగాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): భోగాపురం నుంచి ముక్కాం వైపు వెళ్లే రహదారిలో గల పశువుల ఆసుపత్రి సమీపంలో ఉన్న సీసీరోడ్డు లోతట్టుగా ఉండడంతో వర్షపునీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మురుగంతా రోడ్డుపైనే..

వంగర, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అరసాడలో చిన్నపాటి వర్షం పడితే రహదారిలో నీరు నిలిచి.. స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. హోటళ్లు, షాపుల నుంచి వచ్చిన మురుగునీరు అంతా బంకు సమీపంలోకి వచ్చి చేరుతుంది.

రాకపోకలు బంద్

కొత్తవలస, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి కొత్తవలస జంక్షన్ జలమయం అయ్యింది. రైల్వేస్టేషన్ నుంచి కొత్తవలస జంక్షన్ వరకు మోకాళ్ల లోతులో నీటితో నిండిపోయింది. చిరు వ్యాపారుల దుకాణాలన్ని మునిగిపోయాయి. అండర్ బ్రిడ్జి పూర్తిగా నీటితో నిండిపోయింది. వివిధ గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. మంగళపాలెం వద్దనున్న అండర్ బ్రిడ్జిలోకి భారీగా నీరు చేరడంతో గ్రామంలోకి వెళ్లడమే కష్టమైపోయింది.


వంగర: అరసాడలో బంకు సమీపంలో నిలిచిన వర్షపునీరు

రాజాంలో ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి..

రాజాం రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాజాంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పట్టణ ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. పట్టణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడికక్కడే నీరు నిలిచిపోతుంది. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి. రాజాం-డోలపేట రోడ్డులో విస్తరణ పనులు నిలిచిపోవడంతో వాహన చోదకులకు ఎక్కడ గొయ్యి ఉందో తెలియని దుస్థితి.

అరకొర మరమ్మతులు

రేగిడి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పాలకొండ- రాజాం రోడ్డును గతంలో అరకొరగా మరమ్మతులు చేపట్టి విడిచిపెట్టారు. దీంతో ఎక్కడికక్కడే వర్షపునీరు నిలిచిపోతోంది. మజ్జిరామునిపేట వద్ద పెద్ద గుంతలతో చెరువును తలపిస్తోంది. ఇంకా ఉంగరాడమెట్ట, సంకిలి, బొడ్డవలస వంతెన పైభాగంలోనూ రోడ్డుపై భారీ గంతలు ఉన్నాయి. ● మజ్జిరామునిపేట మీదుగా వెళ్లే కొమిరి-వెంకటాపురం రోడ్డు దరిలో ఉన్న ఇళ్లకు సరైన డ్రైనేజీ లేదు. వర్షం వస్తే రోడ్డుపై నీరు నిల్వ ఉండిపోతోంది.


రేగిడి: మజ్జిరామునిపేటలో రోడ్డుపై చేరిన డ్రైనేజీ నీరు


గరివిడి: ఇదీ గర్భాం రోడ్డు పరిస్థితి


భోగాపురం: పశువుల ఆసుపత్రి సమీపంలో..


కొత్తవలస: రైల్వే స్టేషన్ సమీపంలో రహదారిపై ప్రవహిస్తున్న నీరు


రాజాం రూరల్: మెయిన్‌రోడ్ మీదుగా ప్రవహిస్తున్న మురుగు


రాజాం రూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఇలా..

లారీ బోల్తా.. క్లీనర్ మృతి

సాలూరు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగడవలస వద్ద ఆదివారం లారీ బోల్తాపడడంతో సాలూరుకు చెందిన క్లీనర్ మృతిచెందాడు. పోలీసులు, స్థానిక కథనం మేరకు.. సీతందొరవలస నుంచి కర్రల లోడుతో రాయగడ జేకే పేపర్‌మిల్స్‌కు లారీ వెళ్తోంది. ఈ లారీ ముగడవలస సమీపంలో అదుపుతప్పి బోల్తా పడడంతో క్లీనర్ మేడిశెట్టి వెంకటరమణ (37) క్యాబిన్ కింద ఇరుక్కుపోయి అక్కడికక్కడే మరణించాడు. వెంకటరమణ తండ్రి తాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేశారు. ఇంటి నుంచి వెళ్లిన కుమారుడు శవమై కనిపించడంతో తండ్రి తాత, తల్లి రాములమ్మ రోదనలు మిన్నంటాయి. తాత దంపతుల రెండో కొడుకు తిరుపతి సైతం లారీ ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. ఇద్దరు కుమారులు కూడా మృతిచెందడంతో తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

రామభద్రపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రామభద్రపురం శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన గోర్లి రమేష్(44) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఎస్ఐ వెలమల ప్రసాదరావు కథనం మేరకు.. రమేష్ ఈనెల 15న కడుపునొప్పి తాళలేక చినమ్మతల్లి ఆలయం దగ్గర పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న బంధువులు బాడంగి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కాలం చెల్లిన బిస్కెట్లు స్వాధీనం

సాలూరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సాలూరు మండలంలోని తోణాంలో రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఆరు దుకాణాలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్, బిస్కెట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వీటిని విక్రయానికి ఉంచిన ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

రెడ్డివానివలసలో కార్డన్ సెర్చ్

● 30 లీటర్ల సారా, వెయ్యి లీటర్ల మడ్డికల్లు ధ్వంసం


పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా, కల్లు ముడిసరుకు

మెంటాడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆ గిరిజన గ్రామంలో అడుగుపెడితే సారా, మడ్డికల్లు వాసన స్వాగతం పలుకుతుంది. అక్కడున్న 30 కుటుంబాల్లో రమారమి 20 కుటుంబాలు సారా, మడ్డికల్లు తయారీ, అమ్మకంపై జీవనం సాగిస్తున్నారు. దీంతో పోలీసులు ఆ గ్రామంపై మూకుమ్మడి దాడిచేశారు. కొండలింగావలస పంచాయతీ శివారు గిరిజన గ్రామమైన రెడ్డివానివలసలో సారా, మడ్డికల్లు తయారీ స్థావరాలపై ఆదివారం తెల్లవారుజామున పోలీసులు దాడి చేశారు. గజపతినగరం సీఐ జీవీ రమణ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మడ్డికల్లు తయారీకి సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల ముడిసరుకు, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. వాటిని గ్రామం బయట ధ్వంసం చేశారు. ఈసందర్భంగా సీఐ రమణ మాట్లాడుతూ సారా, మడ్డికల్లు తాగడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, అనర్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ఎస్ఐ సీతారాం, గజపతినగరం, బూర్జివలస ఎస్ఐలు కిరణ్‌కుమార్, నాయుడు, ఏఎస్ఐలు ఐవీ.రమణ, గోపినాయుడు, రమణ, సుమారు 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

స్పా సెంటర్ల తనిఖీ

విజయనగరం క్రైం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో గల స్పా సెంటర్లను ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో వన్‌టౌన్ సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరి సిబ్బంది శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ స్పా సెంటర్లకు సీసీ ఫుటేజీలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులను సక్రమంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు ప్రసన్నకుమార్, సురేంద్ర నాయుడు, రామ్‌గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం

విజయనగరం టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ అన్నారు. నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ వకుల్ జిందాల్ హాజరయ్యారు. ఏటీకే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖలీల్ బాబా పాల్గొన్నారు. విశిష్ట అధ్యక్షుడు వెంకటేశ్వర మహాపాత్రో అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పీఎస్ఎస్‌వీ ప్రసాదరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎంఎస్ఎన్.రాజు, చిన్న ప్రతికల సంఘం జిల్లా అధ్యక్షుడు కేజే.శర్మ, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పంచాది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో రక్తదాన శిబిరం

రాజాం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు సూచనలతో అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో చిరంజీవి అభిమానులు రాజాం శాఖ సమక్షంలో విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాజాం సీఐ కె.అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాన్స్ అధ్యక్షుడు వి.చంద్రశేఖర్, కె.జనార్దన్, కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మెగా ఫ్యామిలీ సేవకుడు జి.కొండలరావు, జిల్లా కరస్పాండెంట్ బి.రమణ, వికాస తరంగిణి రాష్ట్ర సమన్వయకర్త టీటీవీ రమణమూర్తి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేద మహిళలకు నిత్యావసర సరుకుల పంపిణీ

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని కణపాకలో నవజీవన్ ట్రస్టు వ్యవస్థాపకుడు డా.కె.శ్రీధర్ ఆచార్య ఆధ్వర్యంలో 35 మంది వితంతు మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధి సుభద్రాదేవి, నవజీవన్ మేనేజరు ఎస్‌వీ రమణలు హాజరై మాట్లాడారు. ప్రతి నెల తొలి వారంలో ట్రస్టు ఆధ్వర్యంలో వితంతు పేద మహిళలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ట్రస్టు ప్రతినిధి రామునాయుడు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్దు

జామి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగరం గ్రామంలో శ్మశాన వాటికకు ఆనుకుని ఉన్న చెత్తసంపద కేంద్రం వద్ద డంపింగ్‌యార్డు నిలిపివేయాలని స్థానికులు కోరారు. ఆదివారం ఇక్కడకు చెత్త తీసుకొస్తున్న పారిశుధ్య సిబ్బందిని, వారి వాహనాలను అడ్డుకున్నారు. ఈవిషయంపై సర్పంచ్ వసి పార్వతి మాట్లాడుతూ 2014లో ఈ కేంద్రం నిర్మించారని, అప్పుడు ఎవరూ వ్యతిరేకించలేదని, ప్రస్తుతం కొంతమంది నాయకులు గ్రామస్థులను రెచ్చగొట్టడం భావ్యం కాదన్నారు. అలాగే గ్రామంలో ఉన్న రెండు శ్మశానాల స్థలాలను కొందరు ఆక్రమించారని, ఈ విషయంపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు ఉంటే చెత్తను వేరే చోటకు తరలించగలమని, కేంద్రం మార్పు తమ చేతుల్లో లేదని స్పష్టంచేశారు.

రామనారాయణంలో రామాయణ శంఖారావం

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని రామనారాయణంలో వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ఆన్ రామాయణం ఆధ్వర్యంలో సెప్టెంబరు 20న శ్రీరామాయణ శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి నారాయణం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరామనారాయణ శంఖారావం అనే ప్రధాన థీమ్‌పై ప్రత్యేక పోస్టర్‌ను సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ చేతుల మీదుగా ఢిల్లీలోని తన నివాసంలో ఆ ట్రస్టు ఛైర్మన్ నారాయణం నాగేశ్వరరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు, వైస్ చాన్సలర్లు, ప్రఖ్యాత న్యాయవాదులు, న్యాయ కళాశాల విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

లోకేశ్‌ను కలిసిన వాజీ చానల్ ఎండీ



విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను వాజీ చానల్ ఎండీ గణపతినీడి శ్రీనివాసరావు ఆదివారం అమరావతిలో కలిశారు. ఈసందర్భంగా వీరు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పార్టీ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన లోకేశ్‌ని సన్మానించారు. అనంతరం మంత్రి తన యువగళం పుస్తకాన్ని శ్రీనివాసరావుకు అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తవలస, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ ఏఈ సూరిబాబును వివరణ కోరగా, బ్రేక్‌డౌన్ అయిందని, మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. రాత్రి ఏదో సమయానికి విద్యుత్ పునరుద్ధరిస్తామని చెప్పారు.

సకాలంలో ఎరువులు అందిస్తాం


నాగార్జునను సత్కరిస్తున్న దృశ్యం

గుర్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు సకాలంలో అందే విధంగా కృషి చేస్తానని డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం గూడెం సొసైటీ అధ్యక్షుడిగా పిల్ల అప్పలనాయుడు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి కాలువ నీరు వచ్చేటట్టు పెద్దలతో మాట్లాడుతానన్నారు. అనంతరం ఆయన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీర మహిళలకు సత్కారం



పాలవలస యశస్విని సత్కరిస్తున్న చిరంజీవి యువత ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో జిల్లా చిరంజీవి యూత్ ఆధ్వర్యంలో ఆదివారం వీర మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అఖిల భారత చిరంజీవి యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు పిలుపుతో ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీరమహిళలు తుమ్మిలక్ష్మీరాజ్, మాతా గాయిత్రీ, పుష్పకుమారి, మాధవి, పద్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

నాగావళికి జలకళ


సంకిలి వద్ద నాగావళి ప్రవాహం

రేగిడి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎగువన పడుతున్న వర్షాలతో తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టులు నిండిపోవడంతో నాగావళికి నీరు విడిచిపెడుతున్నారు. దీంతో నాగావళికి ఆదివారం ఉదయం ఒక్కసారిగా జలకళ కనిపించింది. లోతట్టువాసులను స్థానిక రెవెన్యూ సిబ్బంది అప్రమత్తం చేశారు.

ప్రమాదపు అంచున చెరువు గట్టు


పాత చెరువుకు గండి పడుతున్న దృశ్యం

సంతకవిటి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కృష్ణంవలస, శ్రీహరినాయుడుపేట గ్రామాల మధ్య ఉన్న పాత చెరువుకు గండి పడుతోంది. ఈ రంధ్రం పెరిగి చెరువు గట్టు కోతకు గురవుతోంది. పూర్తిగా గండి పడక ముందే పూడ్చకపోతే సుమారు 300 ఎకరాలకు పంట నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గండి పెరిగి గట్టు చీలిపోతే పొలాలకు వెళ్లే మార్గానికి కూడా అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ● దీనిపై తహసీల్దార్ సుదర్శన రావును వివరణ కోరగా సంబంధిత నీటి పారుదల అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని, సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

రాజాం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమం కోసం దేశంలోనే మొదటిసారిగా సంక్షేమ విభాగాన్ని ఏర్పాటు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. గరివిడి మండలం వెదుళ్లవలస గ్రామానికి చెందిన మల్లు సూర్యనారాయణ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన చొరవతో టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా మంజూరైన రూ.5లక్షల చెక్కును ఆదివారం రాజాం క్యాంపు కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడమే ధ్యేయంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని అన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడం వల్లే బాధిత కుటుంబానికి పార్టీ అండగా నిలబడిందన్నారు. ఈ కార్యక్రమంలో గరివిడి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాతల్లో ఆనందం

గజపతినగరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో నీరు నిండడంతో రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. పొలాల్లో కూడా ఉభాలకు సరిపడినంతగా నీరు చేరడంతో ఓ వైపు ట్రాక్టర్లతో పొలాలను సిద్ధం చేస్తూ మరోవైపు ఆకుతీత నాట్లు వేసే పనుల్లో తనమునకలవుతున్నారు. సబ్ డివిజన్ పరిధిలో గల గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాలకు సంబంధించి 12,874 హెక్టార్లలో వరిసాగు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు 1,415 హెక్టార్లలో రైతులు వరిసాగు చేపట్టారు. గత 4 రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తి స్థాయిలో నాట్లు వేస్తున్నారని ఏవో కిరణ్‌కుమార్ తెలిపారు.

పీఏసీఎస్‌ల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

గుర్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌ల అభివృద్ధే టీడీపీ లక్ష్యమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. గూడెం పీఏసీఎస్ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన పిల్ల అప్పలనాయుడును ఆయన ఆదివారం అభినందించారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వెన్ని సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు చెనమల్లు మహేష్ తదితరులు పాల్గొన్నారు. ● తెర్లాం: మండలంలో మూడు పీఏసీఎస్ ఛైర్మన్లు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. తెర్లాం పీఏసీఎస్ ఛైర్మన్‌గా నర్సుపల్లి వెంకటేశ్వరరావు, పెరుమాళి పీఏసీఎస్ ఛైర్మన్‌గా సాగిరాజు జగ్గరాజు, నందిగాం పీఏసీఎస్ ఛైర్మన్‌గా నగిరెడ్డి రమణతో పాటు పలువురు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర శిబిరం

రాజాం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉదయం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వైద్యులు యు.కిరణ్ కుమార్, ఆప్తొమిక్ అధికారి వసంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో రోటరీ క్లబ్ టౌన్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కంటి శుక్లాలు సమస్య ఉన్నవారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఫోన్ నెంబరు తీసుకుని రావాలని సూచించారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర గ్రామంలో గత 57 రోజులుగా జిందాల్ నిర్వాసితులు నిరసన చేపడుతున్నారు. ఆదివారం జోరువానలో జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో నోటికి నల్లగుడ్డలు కట్టుకుని నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ జిందాల్‌కు ప్రభుత్వం చేసిన రిజిస్ట్రేషన్లు వెంటనే రద్దు చేసి, రైతుల భూములు వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.


నోటికి నల్లగుడ్డలు కట్టుకుని వర్షంలో నిరసన చేస్తున్న దృశ్యం

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

● ఆలయాల్లో కొనసాగుతున్న ప్రత్యేక పూజలు
● కృష్ణుని విగ్రహం ఊరేగింపు

శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ఈనెల 16న జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. విజయనగరంలోని గురజాడ కళాభారతిలో ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక సంయుక్తంగా కృష్ణజన్మాష్టమి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట కోదండ రామాలయంలో కృష్ణ జన్మాష్టమి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బొబ్బిలి, చీపురుపల్లి, గరివిడి, గజపతినగరం, గంట్యాడ, జామి, ఎస్‌కోట, రాజాం తదితర ప్రాంతాల్లో కృష్ణాష్టమి పూజలు కొనసాగుతున్నాయి.


ఎస్.కోట రూరల్: పుణ్య తిరుమలగిరిలో వేడుకలు


చీపురుపల్లి: శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


విజయనగరం రూరల్: కొత్తపేట కోదండ రామాలయంలో


వేపాడ: పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పనులు చేశారు.. పలకలు మరిచారు

● పాలకొండలో తోటపల్లి ఎడమ ప్రధాన కాలువపై పరిస్థితి



కాలువపై పలకలు ఏర్పాటుచేయని దృశ్యం

పాలకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌లోగల తోటపల్లి ఎడమ ప్రధాన కాలువపై పనుల కోసం తొలగించిన పలకలను ఏర్పాటుచేయకపోవడంతో పరిసరాల్లో నివాసముంటున్నవారంతా అగచాట్లకుగురవుతున్నారు.ఇక్కడ కాలువలో పూడికలు తొలగించిన తర్వాత పలకలు వేయాల్సిఉన్నా అధికారులు ఏర్పాటుచేయడం మరిచిపోయారు. దీంతో కాలనీలో నివాసముంటున్న వెయ్యికుటుంబాలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ కాలువ గుండా వడమ వరకు సాగునీరందుతోంది. అధికారులు పలకలు ఏర్పాటుచేయకపోవడంతో ఇటీవల కాలనీవాసులు తాత్కాలికంగా నడిచివెళ్లేందుకు వీలుగా చిన్న పలక ఏర్పాటుచేశారు. ఇక్కడ చీకటి పడిన తర్వాత ఏపాటి ఏమరపాటుగా ఉన్నా కాలువలోకి జారిపడే అవకాశముందని స్థానికులు భయాందోళన చెందుతున్నా రు. నిత్యం రద్దీగాఉండే ఆ కాలువపై పలకలు వేయకపోవడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఇక్కడ పలకలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని ఇటీవల అధికారులను కలిసినా ఫలితం లేకుండాపో యిందని స్థానికులు వాపోతున్నారు.

తిరుమలాచార్యులు మృతి తీరని లోటు

సాలూరు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలాచార్యులు మృతి సాలూరులో సాహిత్య రంగానికి తీరని లోటని పలువురు వక్తలు తెలిపారు. ఇటీవల తిరుమలాచార్యులు మృతిచెందడంతో సంతాపసభ ఆదివారం సాలూరు సాహితీమిత్రబృందం ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో రాంప్రసాద్,రావాడ భాస్కరరావు, దాలినాయుడు, కృష్ణాజీ, పట్నాల ఈశ్వరరావు, సత్యనారాయణ, కృష్ణకుమారి, చందు, గణపతి, శ్రీనివాసరావు, గౌరీశంకరరావు, జోగినాయుడు పాల్గొన్నారు.

పాలకొండలో కృష్ణాష్టమి వేడుకలు

పాలకొండ,ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాలకొండలోని ఏలాం జంక్షన్‌లోని కృష్ణుడి విగ్రహం వద్ద కృష్ణాష్టమి వేడుకలను ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లా కొండలరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఉట్టి సంబరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రయోగమూర్తి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, జల్లు నారాయణరావు, ఆనాపు జవరాజు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



సీతంపేట రూరల్,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):సీతంపేట గ్రామానికి చెందిన గృహిణి పి.ప్రమీల ఇంటిపై అరుదైన బ్రహ్మకమలం వికసించింది. ఆదివారం రాత్రి సమయంలో ఈ అరుదైన బ్రహ్మకమలం వికసించడంతో చుట్టుపక్కల ఇళ్లల్లోని మహిళలు చూసేందుకు ఆసక్తిచూపారు. పరమశివునికి ఎంతో ప్రీతిపాత్రమైన ఈ పుష్పం అరుదుగా ఏడాదికి ఒక్కసారి మాత్రమే వికసిస్తుంది.

సంప్రదాయాలను తెలియజేయాలి

రాయగడ,ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హైందవ సంస్కృతి ,సంప్రదాయాలు ముందు తరాలకు తెలియాజేయాలని సబ్‌కలెక్టర్ రమేష్‌కుమార్ జెన్నా తెలిపారు. రాయగడలో క్లబ్ ది యంగ్ ఇండియా అధ్యక్షుడు సురేంద్ర ప్రసాద్ సాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమేష్‌కుమార్ జెన్నా మాట్లాడుతూ రామా యణ, భారతం, భాగవత గ్రంథాల్లో భగవంతుడు మానవ జీవి తపు విలువలు, సామాజిక బాధ్యత గురించే ముందే చెప్పాడన్నారు.

అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

పొందారని ఈ ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో కూటమి ప్రభుత్వం పింఛన్‌లను పునఃపరిశీలన చేయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులతో పరీక్షలు చేయించింది. ఇందుకు ముందుగా నోటీస్‌లు పంపించారు. ప్రత్యేక సదరం క్యాంపుల ను నిర్వహించారు. ప్రభుత్వం సూచించిన ఆసుపత్రికి వెళ్లి మెడికల్, వైకల్యం పరీక్షలు చేయించుకోవాలని సూచించింది. అనర్హతతో పింఛన్ పొందుతున్న చాలా మంది ఈ సదరం క్యాంపులకు హాజరుకాలేదు. ఎంతోకొంత అంగవైకల్యం ఉన్న వారంతా ప్రభుత్వం చెప్పిన సదరం క్యాంపులకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు. తనిఖీలు చేసిన వైద్యులు నేరుగా రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)కు మెడికల్, దివ్యాంగ శాతం నిర్ధారణ వివరాలను పంపించారు. ఈమేరకు ప్రభుత్వం తొలగింపు నిర్ణయం తీసుకుంది.

పింఛన్లలో మార్పులు

● 85శాతం పైబడి దివ్యాంగత్వం ఉంచి మంచానికి పరిమితమైన వారికి రూ.15,000 పింఛన్ ● 85శాతం కంటే తక్కువ ఉండి 40శాతం కంటే ఎక్కువ ఉంటే మెడికల్ పింఛన్ నుంచి రూ.6000 దివ్యాంగ పింఛన్‌కు మార్పు ● 40శాతం కంటే తక్కువగా దివ్యాంగత్వం ఉండి 60 సంవత్సరాల వయసు పైబడి ఉంటే రూ.4,000 వృద్ధాప్య పింఛన్‌కు బదిలీ చేస్తారు. 60 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉంటే పింఛన్ తొలగింపే ● 40శాతంకంటే ఎక్కువ దివ్యాంగత్వం ఉంటే రూ.6000 యథావిధిగా మంజూరు ● 40శాతం కంటే దివ్యాంగత్వం తక్కువగా ఉన్న పింఛన్‌దారుల్లో 60 సంవత్సరాలు పైబడితే రూ.4000 వృద్ధాప్య పింఛన్‌కు మార్పు. వయసు తక్కువ అయితే పింఛన్ రద్దు.

ఆదుకోండి సారూ!

(5వ పేజీ తరువాయి)

రేవళ్ల పాండురంగనాయుడు తమ సమస్యలను 2025, జూలై 1న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. వలంటీర్ల నియామకంలో అవకాశం కల్పించాలని కోరారు. కచ్చితంగా తమకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వలంటీర్ల నియామకంపై ప్రభుత్వం నుంచి తమకెటువంటి ఆదేశాలు రాలేదని ఎంపీడీవో కె.ధర్మారావు తెలిపారు. దీనిపై ఆదేశాలు వస్తే తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దంచికొడుతున్నాయ్!

(ఐదో పేజీ తరువాయి)

స్వల్పంగా నీటి ప్రవాహం పెరిగింది. దీంతో సింగిడి, పసుకుడి, దిమ్మిడిజోల, తాలాడ, కీసర, కోసలి తదితర నదీ తీర గ్రామస్థులను రెవెన్యూ సిబ్బంది అప్రమత్తం చేశారు.

నేడు, రేపు భారీ వర్షాలు: కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఆదివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరగరాదన్నారు. గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. ఆరుబయట ఎవరు తిరగరాదని, శిథిలావస్థ భవనాలు, చెట్లు కింద ఉండరాదని సూచించారు. లోతట్టు, నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. నదుల్ల ఇసుక తవ్వకాలు చేపట్టరాదన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

పిచ్చిమొక్కలు పెరిగి.. ప్రమాదకరంగా మారి

● భయాందోళన చెందుతున్న వాహనచోదకులు

● ఇదీ తోటపల్లి పాత బ్యారేజీ కల్వర్టుపై పరిస్థితి

గరుగుబిల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి సమీపంలోని తోటపల్లి పాత బ్యారేజీకి చెందిన ప్రధాన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. రహదారికి ఆనుకుని ఒకవైపు పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు ఇక్కడ మలుపు వల్ల ఎదురుగా వాహనాలు వచ్చే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బ్రిటీష్ పాలకుల హయాంలో నిర్మించిన ప్రధాన కల్వర్టు శిథిలావస్థకు చేరుకున్నా అధికారులు దృష్టి సారించని పరిస్థితి ఏర్పడింది. దీంతో నిత్యం బిక్కుబిక్కుమని ప్రయాణించాల్సివస్తోంది. ఈమార్గం గుండా కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని వందలాది గ్రామాల ప్రజలతోపాటు అంతర్రాష్ట్ర సర్వీసులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి.ఇక్కడ ఇరుగ్గా ఉండడంతో తరచూ రక్షణ గోడలకు వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్న విషయం విదితమే. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని పలు అభివృద్ధి పనులు నిర్వహణకు చొరవ చూపుతున్నా, కల్వర్టు నిర్వహణపై దృష్టిసారించకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రమాదవశాత్తు ప్రధాన కల్వర్టు కూలిపోతే రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని స్థానికులు చెబుతున్నారు. 120 సంవత్సరాల చరిత్రగల తోటపల్లి పాత రెగ్యులేటర్ ప్రధానకల్వర్టుకు మరమ్మతులు చేసేందుకు జలవనరులు, ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. అయితే కల్వర్టు దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండేలా జట్టు సంస్థ ముందుకు వచ్చి తాత్కాలికంగా పనులు చేపట్టింది. ప్రధాన కల్వర్టు పాడైనట్లు తెలియని భారీ వాహనాల డ్రైవర్లు ఒడిశా వైపు వెళ్లేందుకు ఈ మార్గంలో వచ్చే సమయంలో ముందుకు వెళ్లలేకపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. భారీ వాహనాలు వెనక్కువెళ్లేందుకు జేసీబీలను వినియోగించాల్సి వస్తోంది. కాగా తోటపల్లి పాత రెగ్యులేటర్‌కు ఆనుకుని రాకపోకలకు వీలుగా బ్రిడ్జి నిర్మించాలని తోటపల్లిలోని జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ డి.పారినాయుడు కోరారు. ప్రధాన కల్వర్టు కూలితే ఒడిశా, ఆంధ్రాకు రాకపోకలు నిలిచిపోతాయని తెలిపారు.



మరమ్మతులకు నోచుకోని ప్రధాన కల్వర్టు



మలుపులో పెరిగిన పిచ్చి మొక్కలు

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



మాట్లాడుతున్న బేబీనాయన

బొబ్బిలి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. మండలంలోని పిరిడిలో సత్యసాయిబాబా మందిరాన్ని పునర్నిర్మించారు. ఈ మేరకు ఆదివారం మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతత నెలకొంటుందని తెలిపారు. కాగా సత్యసాయి మండలి సౌజన్యంతో నెల్లిమర్లలోని మిమ్స్ ఆధ్వర్యంలో వైద్యనిపుణులు 150 మందికి వైద్యసేవలందించారు.కార్యక్రమంలో మందిర ట్రస్టీ కొల్లి చలం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ ఖ్యాతి సాధించాలి

● ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

నెల్లిమర్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వెయిట్ లిఫ్టింగ్‌లో జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప చేయాలని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండవెలగాడలో ఉత్తరాంధ్ర జిల్లా స్థాయి ఖేలో ఇండియా మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, కూటమి నాయకులు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

● ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు డిమాండ్

బొబ్బిలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, పర్మినెంట్ ఉద్యోగాల భర్తీలో ఆశా కార్యకర్తలకు రిజర్వేషన్ కల్పించాలని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్‌చేశారు. ఆదివారం బొబ్బిలిలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా నాలుగో మహాసభను పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన జిల్లా మహాసభల్లో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ అదానీకి నాయకులు పోటాపోటీగా తాకట్టుపెడుతున్నారు. ఆశావర్కర్ల సమస్యలపై అనేక పోరాటాలుచేస్తే, కొన్ని హామీలను మాత్రమే నెరవేర్చారన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా, రైతు సంఘాల అధ్యక్షులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, యూటీఎఫ్ నేత విజయగౌరి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుధారాణి, లంక శాంతి, సురేష్ పాల్గొన్నారు. కాగా ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలిగా మహాలక్ష్మి, కార్యదర్శిగా బి.సుధారాణి ఎన్నికయ్యారు.

కోదండరామస్వామికి వెండి కిరీటాలు బహూకరణ



వెండి కిరీటాలు అలంకరించిన దృశ్యం

బొబ్బిలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలోని తారకరామాకాలనీలో గల కోదండరామాలయానికి గొర్లె శంకరరావు దంపతులు ఆదివారం వెండి కిరీటాలను బహూకరించారు. అర్చకులు గొల్లపూడి వేణుగోపాలశర్మ పూజలు నిర్వహించి కోదండరామస్వామికి, సీత, లక్ష్మణలకు కిరీటాలను అలంకరించారు. తొలుత ఉత్సవమూర్తులతో కలిపి తిరువీధి నిర్వహించారు.

సీఆర్టీలకు జీతాలు చెల్లించాలి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో పలు ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు జీతాలు చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్లా సురేష్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం నుంచి రెన్యువల్ ఉత్తర్వులు వచ్చిన తర్వాత ఇంతవరకు జీతాలు లేవని పేర్కొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి తుహిన్‌కుమార్‌కు సన్మానం



తుహిన్‌కుమార్‌కు సత్కరిస్తున్న న్యాయవాదులు

పాలకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తిగా ఇటీవల ప్రమాణ స్వీకారంచేసిన జస్టిస్ గేదెల తుహిన్‌కుమార్‌కు ఆదివారం పాలకొండలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాలకొండ న్యాయాధికారి చందక హరిప్రియ ఆధ్వర్యంలో న్యాయవాదులు తుహిన్‌కుమార్‌కు సత్కరించి మెమెంటో అందించారు. వీరఘట్టం మండలంలోని కత్తులకవిటికి చెందిన తుహిన్‌కుమార్‌ను కలుసుకోవడం సంతోషంగా ఉందని పలువురు న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత సెకెండ్ క్లాస్ న్యాయాధికారి బి.గంగునాయుడు, పాలకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శామ్యూల్, న్యాయవాదులు ఉత్తరావల్లి మురళీమోహన్, చందక జగదీష్‌కుమార్, కనపాక సూర్యప్రకాష్, బలగ నరసింహమూర్తి, చందక జగదీష్‌కుమార్, మౌళి, ఉపేంద్ర, మోహన్ పాల్గొన్నారు.

●వీరఘట్టం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కత్తులకవిటిలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్‌కుమార్‌ను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు, కర్నేన అప్పలనాయుడు, ఉదయాన ఉదయ్‌భాస్కర్, చింత ఉమా, జామి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలఅభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

వీరఘట్టం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేస్తున్నామని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. ఆదివారం వీరఘట్టంలో రాష్ట్రంలో సెలూన్‌షాప్‌లకు 200 యూనిట్లు కరెంట్‌ఉచితంగా ఇవ్వడంతో చంద్రబాబునాయుడు చిత్రపటానికి నాయీబ్రాహ్మణులు ఆదివారం పాలఅభిషేకం చేశారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ సాధికార సమితి కన్వీనర్, రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంఘం సెక్రటరీ పొన్నాపురవి, పొన్నాపుమజ్జేశ్వరరావు, తొట్టరపూడి మహేష, వెంకటీ, అలజంగి సాయి, సాయిరాం, తొట్టారపూడి త్యం, వెంకటరమణ, శంకర్, జనార్దన పాల్గొన్నారు.

వంశధారకు పెరిగిన వరద

● నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: తహసీల్దార్

భామిని, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):ఒడిశాలో వర్షాలు కురుస్తుండడంతో వంశధార నదిలో వరద పెరిగింది. దీంతో నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎన్.శివన్నారాయణ సూచించారు. ఆదివారం లివిరి, నేరడి గ్రామాల్లో నది రేవులు పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు. కొద్దిరోజులుగా క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలకు వంశధార నదీ ప్రవాహం మరింత పెరిగే అవకాశముందని తెలిపారు. మహిళలు, పిల్లలు నదీ సమీపానికి వెళ్లరాదని దండోరా వేయించాలన్నారు. వంశధార వరద పెరగడంతో సింగిడి, పసుకుడి, దిమ్మిడిజోల, తాలాడ, కీసర, కోసలి తదితర గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయనతో ఆర్ఐ మణి ప్రభ, విఆర్‌వోలు చిన్నారావు, జి.వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

నేడు ఐటీడీఏలో పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు(పీజీఆర్ఎస్) ఏపీవో జి.చిన్నబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం గిరిజనులు పీజీఆర్ఎస్‌ను ఆశ్రయించవచ్చని సూచించారు.

పీఏసీఎస్ చైర్మన్లు ప్రమాణ స్వీకారం

తెర్లాం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగ్గురు పీఏసీఎస్‌ల చైర్మన్లు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. తెర్లాం సొసైటీ చైర్మన్‌గా నర్సుపల్లి వెంకటేశ్వరరావు, పెరుమాళి సొసైటీ చైర్మన్‌గా సాగిరాజు జగ్గరాజు, నందిగాం సొసైటీ చైర్మన్‌గా నగిరెడ్డి రమణతోపాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్ముంనాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అసెస్‌మెంట్ పుస్తకాలు ఇవ్వాలి

సాలూరు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకు కూడా అసెస్‌మెంట్ పుస్తకాలు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు కోరారు. ఆదివారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం తల్లికి వందనం పథకం వర్తింపజేసిందని తెలి పారు. ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబం ధనలు, అకడమిక్ విషయాలను పాటిం చాల్సి ఉందని చెప్పారు. ప్రభుత్వ పాఠశా లలకే అసెస్మెంట్ పుస్తకాలు ఇచ్చారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు వాటిని అందించి ప్రభుత్వ పాఠశాలల వలె పరీక్ష లను నిర్వహించాలని కోరారు. ఎండీఎం బియ్యం పాఠశాలల వద్దకే చేర్చాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాత విధానంలోనే పరీక్షలను నిర్వహించాలని కోరారు. యాప్‌ల భారం తగ్గించాలని తెలిపారు. విద్యార్థులకు ముఖ హాజరు అమలు చేయ వద్దన్నారు. ఆయనతోపాటు ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మీసాల వెంకట గౌరీశం కరరావు ఉన్నారు.

అలరించిన ఆనందోబ్రహ్మ కార్యక్రమాలు

బొబ్బిలి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతికకార్యక్రమాలు అలరించాయి. ఆనందోబ్రహ్మ సంస్థ అధ్యక్షుడు మింది విజయమోహన్ ఆధ్వర్యంలో దుర్యోధన గర్వభంగం, శ్రీకృష్ణలీలలు, నాన్నా మిస్ యూ, అల్లుడా మజాకా, మేడ్ ఇన్ ఇండియా, మాయాబజార్ మధుర సినీగేయాలు, విద్యార్థుల ప్రత్యేక కదంబ కార్యక్రమం వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాసంస్థల ప్రతినిధులు నంబియార్ వేణుగోపాలరావు, ఎస్‌వీ రమణమూర్తి, డీవీ అప్పారావు, జల్లు వెంకటమెహెర్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



సీతంపేట రూరల్: ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మస్తాన్

సీతంపేట రూరల్,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):వాహనచోదకులు రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని దోనుబాయి ఎస్ఐ మస్తాన్ సూచించారు. ఆదివారం కిల్లాడలో వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మితిమీరిన వేగం, రహదారి భద్రత, డ్రగ్స్, హెల్మెట్ వినియోగంపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు.

● సీతానగరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చయ్యపేటలో ఆదివారం ఎస్ఐ ఎం.రాజేష్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి వెళ్లరాదని, కారు డ్రైవర్లకు సీటు బెల్టు తప్పనిసరి అని తెలిపారు.హెల్మెట్‌ను ధరించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, సీబుక్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ ఉండాలని సూచించారు.

గంజాయి రవాణా చేస్తే చర్యలు

పాలకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ రవాణా చేస్తే చర్యలు తప్పవని సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి హెచ్చరించారు.డ్రగ్స్, గంజాయి, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పాలకొండలోని గాయత్రీ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అంతర జిల్లా చెక్‌పోస్టును ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ రవాణా చేస్తున్నట్టు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

పాచిపెంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కోనవలస వద్ద గల ఆంధ్రా - ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సాలూరురూరల్ సీఐ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో పాచిపెంటఎస్ఐ కె.వెంకటసురేష్ సిబ్బందితో తనిఖీచేశారు. రోడ్డు సేఫ్టీ విధుల్లో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఫోర్ వీలర్ వాహనచోదకులు సీటు బెల్టు వినియోగించకపోతే కేసులు నమోదుచేస్తామని సీఐ రామకృష్ణ హెచ్చరించారు.

పాలకొండను జిల్లాగా ప్రకటించాలి

● జిల్లా సాధన సమితి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బుడితి అప్పలనాయుడు

పాలకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాలకొండను జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన సమితి డిమాండ్‌చేసింది. ఆదివారం పాలకొండలో జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో రాజకీయ నాయకులు, మేధావులు, స్థానికుల అభిప్రాయాలను తెలుసుకొనేందుకు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పాలకొండ జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షులు, అధ్యక్షులు కనపాక చౌదరినాయుడు, బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ పాలకొండనుమన్యం జిల్లాలో కలిపి గత ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు.పలువురు వక్తలు మాట్లాడుతూ పాలకొండ జిల్లాతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. గతంలో మాదిరిగానే పాలకొండను శ్రీకాకుళం జిల్లాలో కలిపేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. సాధనసమితి ఆధ్వర్యంలో ఈనెల 21న పాలకొండలో ర్యాలీ నిర్వహించి, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రికి జిల్లా సాధన కోసం తెలిసేలా పోస్టుకార్డుల ఉద్యమం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో వండాన కూర్మారావు, సబ్బ నానాజీ, నందాన రమేష్, బొరోతు శంకరరావు, రెడ్డి బాలమురళీకృష్ణ, రాధాకృష్ణ, బాలరాజు, నెల్లి సత్యంనాయుడు పాల్గొన్నారు.